# పరీక్ష

*

వి. గోపాలస్వామి

*

1941, 42 సం॥ లలో కాగితాల కాటక మవడంవల్ల నా నెంబరుకి జాగా దొరకతే. స్థలమహాత్యం వల్ల కొద్దో గొప్పో లాభముంటుందేమోనని నాన్నగారు ఊరుమార్చమనడం, మూడో దండయాత్రకి second front open చేస్తే జయం కలుగుతుందని ఆశ పుట్టడం—యిత్యాదయః కారణాలతో అమ్మమ్మ యింటికి బరంపురం వెళ్ళేబండిని ఛత్రపురంలో ఎక్కా.

"అంతా కులాసా నేనా" అంటూ జట్కా గుమ్మంలో ఆగిఆగగానే అమ్మమ్మ ఎదురైంది. "ఆ!" అంటూ సూట్కేసు చేత్తో పట్టుకొని చరచర లోపలికెళ్లి బల్లమీద చతికిలపడ్డ. "అంతా నీయధీనం" అన్నట్టుగా అమ్మమ్మకేసి చూసా. ఎట్లా ఐతేనేం మూడణాల ముడుపు జట్కావాడికి ఆమెచేత ముట్టెట్టుచేసా. ఇంట్లోకివచ్చి అమ్మమ్మ ప్రశ్నాపరంపరలు కురుపిస్తే, హిస్టరీపేపర్ లోని "Fit questions & bit answers" కు అలవాటుపడ్డ నేను వాటిని పది నిమిషాల్లో clear off చేసా. అమ్మమ్మ మడికట్టుకుందికి వెళ్ళిపోయింది.........

కొన్నాళ్ళు వెళ్ళేయి......

Quarterly, selection పరీక్షలలో రెండేళ్ళ అనుభవం ఉన్నవాడినికనక కాగితాల ఖర్చు లేకుండానే వాటినీదుకొచ్చా. ఇంకా పబ్లిక్ పదిరోజులుంది.

ఆరోజే యింగ్లీషు 1st paper; ప్రొద్దున్నే లేచా; మొహం కడుక్కోడం, కాఫీ ఆచమనం చెయ్యడం, స్నానం చెయ్యడం etc., కాలకృత్యాలన్నీ తీర్చుకున్నా. అమ్మమ్మ పూజచేస్తుంటే వెనక నిలబడి అమ్మమ్మ చూసేట్టుగా దేవుడికి ఓ, నక్కా నమస్కారం విసిరా. అమ్మమ్మ ఉప్పొంగిపోయింది. "నువ్వుకాకపోతే ఎవరు ప్యాసవుతారు," అంటూ, పూజనుంచి లేచి భోజనానికి కూర్చోమంది. భోంచేసి స్కూలికి బయలుదేరా.........

అన్ని పరీక్షలు అయ్యాయి......

ఈమాటు, మావీధి జ్యోతిష్కుడు చెప్పినట్టుగా pass అవుతాననుకొన్నా.

ఎంచేతనంటే, English 1st and 2nd paper లోని మనరాత చూచి, "ఇంకా వీడెన్నాళ్ళు పీక్క చుట్టుకుంటాడురా" అని examiner pass మార్కులు పడెయ్యొచ్చు. చిల్లర లేని యీగడ్డు కాలంలో చేసిన ప్రతీలెఖ్ఖకి చిల్లరొచ్చిందంటే, లెక్కల్లో 50% రాక ఏమవుతుంది. హిస్టరీ, జాగ్రఫీలలో మనదంతా "research" వర్కే. Science paper చివర "ఇది నామూడో ఏడాది" అని యింకేమేమో రాసా. కాబట్టి దీంట్లో కనీసం pass మార్కైనా యివ్వనంత కఠినహృదయుడుగా examiner ఉండడు. ఇక తెలుగు పేపర్ లోనా, "భారతం ఎవరురాసారు?" అని అడిగితే (అంతకుముందే తెలిసికొన్న) chief examiner పేరు పేపర్ కెక్కించేసా. Group లో ఒక కాగితమైన, ఖర్చుచెయ్యకుండ ప్రభుత్వంకి సాయంచేసా. కాబట్టి పరీక్షప్యాస్ కాక, ఏమవుతుంది?

ఎందుకేనా మంచిదని యిక్కడున్న మూడు రోజులు, question papers లోని questionsకు answers ను రుక్కుపెట్టి, నాల్గోరోజు ఊరికి బయలుదేరా.

జట్కా యింటిదగ్గర ఆగింది. "ఎల్లారాసావు" అంటూనే నాన్నగారు లోనికి దారితీసారు. "బాగానే" అని జవాబు యిచ్చేను. అంతటితో ఊరుకోక నేననుకొన్నట్టుగా papers లోని questions ఒకదాని తరువాత ఒకటి అడగ్గా, గుక్క తిప్పుకోకుండా జవాబు చెప్పేసరికి, "ఈమాటు ప్యాస్ కి లోపములేదు. నిశ్చింతగా ఉండొచ్చు." అనిఅన్నారు. "కాకమరేవి" టంటూ అమ్మ వంటింటిలోంచి అందుకుంది. వంటకాగానే భోజనానికి లేచాం...

రోజులు నిశ్చింతగా మావూర్లో గడుపుతున్నాం. ఏమంటే నాసంగతి నాకూ. మాయింట్లో వాళ్ళకి 'sure' ఏం?